క్లుప్తంగా

ఆర్థికసాయం

హసన్‌పర్తి : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హసన్‌పర్తికి చెందిన ముత్యాల రాజేందర్ కుటుంబానికి మేకల వంశవేదిక బృంద సభ్యులు తమవంతు సాయం చేసింది. ఈ మేరకు సభ్యులు మంగళవారం రాజేందర్ కు టుంబాన్ని పరామర్శించి రూ.10వేలు సాయం చేశారు. పరామర్శించిన వారిలో మేకల వంశ వేదిక అధ్యక్షుడు మేకల యుగంధర్, ప్రధాన కార్యదర్శి హరిశంకర్, కార్యదర్శి సిద్ధార్థ, కార్య వర్గ సభ్యులు ఉన్నారు.

'సహృదయ'లో సోనూసూద్ జన్మదిన వేడుకలు

కాజీపేట: ప్రశాంత్‌నగర్‌కాలనీలో ఉన్న సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం రాత్రి సినీనటుడు సోనూసూద్ జన్మదిన వేడుకలను రిటైర్డ్ ఆర్మీ అధికారులతో కలిసి చిలువేరు శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వృద్ధులకు పంపిణీ చేశారు. వృద్ధులతో ఆత్మీయంగా గడపడంతో పాటు మాజీ సైనికులు సహపంక్తి భోజనాలు చేశారు. డాక్టర్ జగదీష్‌బాబు, యలమంచిలి బృందం యూ బ్లడ్ యాప్‌ను ఆవిష్కరించారు.

కందంబం పూల అలంకరణలో అంజన్న

కాజీపేట: పట్టణంలోని 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ అభయాంజనేయ దేవాలయం ఆవరణలో పూసిన కందంబం పుష్పాలతో అంజన్నను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో పాటు సహస్రధారాలతో నది జలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు పుర ప్రముఖులు అంజన్నను దర్శించుకుని పూజలు చేశారు.

మట్టెవాడ స్టేషన్‌లో ఒకరిపై రౌడీషీట్

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రఘునాథ్‌కాలనీకి చెందిన పానుగంటి సురేశ్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు. సురేశ్‌పై నాలుగు హత్యాయత్నం కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. అమాయక ప్రజలపై ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం



ఖిలా వరంగల్: ప్రజా ఉద్యమాలతోనే సీపీఎం పార్టీ మరింత బలోపేతం అవుతుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య సూచించారు. మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని సీపీఎం కార్యాలయంలో సింగారపు బాబు అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసి పేద ప్రజల సంపదను దోచి కార్పొరేట్ శక్తులకు మేలు చేసిందని ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, భూక్య సమ్మయ్య, నలిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, కుమారస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు

ఇచ్చిన హామీని నెరవేర్చిన ప్రభుత్వం



వరంగల్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. మంగళవారం ప్రభుత్వం రెండో విడతలో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల రుణమాఫీని పురస్కరించుకొని కలెక్టరేట్ కార్యాలయ అవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, సముద్రాల మధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

మడికొండ: స్కూల్ బస్సును కారు ఢీ కొట్టడంతో ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలైన సంఘటన మడికొండలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మడికొండలోని సక్సెస్ పాఠశాలకు చెందిన బస్సు సాయంత్రం విద్యార్థులతో మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తుండగా వెనకాల ధర్మసాగర్ వైపు వెళ్తున్న కారు వాల్మీకినగర్ వద్ద స్కూల్ బస్సును ఢీ కొట్టడంతో బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో బస్సులో ఉన్న ముగ్గురు విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అధికారులు భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదమరిచారో.. అంతే సంగతులు

- ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు
- పట్టించుకోని అధికారులు




ఎలక్ట్రిక్ లోకోషెడ్ నుంచి రైల్వే ఫిట్‌లైన్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లు

కాజీపేట రూరల్ : కాజీపేట బాపూజీనగర్ బూడిద గడ్డ ప్రాంతం–రైల్వే కాలనీ మధ్య గల రైల్వేఫిట్‌లైన్ నుంచి ఎలక్ట్రిక్ లోకోషెడ్ మధ్య రోడ్డు మార్గంలో మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. రైల్వే ఫిట్ లైన్, సీసీఅండ్‌డబ్ల్యూ కార్యాలయం, డీజిల్ లోకోషెడ్, డీజిల్‌కాలనీలకు వెళ్లేందుకు ఇటీవల రైల్వే అధికారులు ఎలక్ట్రిక్ లోకోషెడ్ నుంచి రోడ్డు వేశారు. రోడ్డు మార్గంలో భాగంగా డ్రెయినేజీని నిర్మించారు. నిర్మించిన డ్రెయినేజీ మార్గంలో మూడు చోట్ల మ్యాన్‌హోళ్లపై సిమెంట్ బిల్లలు వేసి కవరప్ చేయకుండా వదిలిపెట్టారు. ఈ మార్గం గుండా రైల్వే కార్మికులు రాత్రి, పగలు వాహనాలపై విధులకు వెళ్లి వస్తుంటారు. ఈ మార్గం గుండా వెళ్లే సమయంలో ఆదమరిచినా, వాహనం అదుపు తప్పినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని రైల్వే కార్మికులు అంటున్నారు. లక్షలు పెట్టి నిర్మించిన రోడ్డు, డ్రెయినేజీలపై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లను మాత్రం మూసివేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు డ్రెయినేజీ మ్యాన్‌హోళ్లపై కవరప్ చేయాలని కార్మికులు కోరుతున్నారు.

మ్యాన్‌హోళ్లు మూసివేయాలి

ఎలక్ట్రిక్ లోకోషెడ్ నుంచి డీజిల్ లోకోషెడ్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మ్యానిహోళ్లను అధికారులు మూసివేయాలి. ఆదమరిస్తే వాహనాలు ఆ మూడు చోట్ల ఉన్న రంధ్రాల్లో ఏదో ఒక మ్యాన్ హోల్‌లో పడటం ఖాయం. – రమేశ్, స్థానికుడు

బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా

- సమస్యలు పరిష్కరించాలని ఔట్‌సోర్సింగ్ కార్మికుల డిమాండ్
- కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

వరంగల్ అర్బన్ : మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు మంగళవారం బల్దియా ప్రధానకార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మిక సంఘం నాయకులు కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు 14 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. వర్షాకాలంలో కార్మికులకు రెయిన్ కోట్స్, పీపీ కిట్స్ అందచేయాలన్నారు. స్వచ్ఛ ఆటోలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, స్లీపింగ్ మిషన్లు వారం రోజుల లోపే మొత్తం రిపేర్ చేయించాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల ఇళ్లల్లో పనిచేసే కార్మికుల స్థానంలో ప్రత్యామ్నాయ కార్మికులను ఏర్పాటు చేయాలని కోరారు. జెన్యూన్‌గా అనారోగ్యం పాలై, డాక్టర్ల సూచన ప్రకారం పనిచేయలేని కార్మికుల స్థానంలో బదిలీ కార్మికులుగా అనుమతించాలని, ఖమ్మం,కరీంనగర్ కార్పొరేషన్‌ల తరహాలో వేతనాలు రూ. 22,500 ఇవ్వాలని, ప్రమాదాల్లో చనిపోయిన కార్మిక కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థికసాయం, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సగానికి పైగా డిమాండ్ల కమిషనర్ ఆమోదం వ్యక్తం చేసినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు చేపట్టాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనేక బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను నిలువు దోపిడీకి పాల్పడుతున్న జూనియర్ కళాశాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నాయకులతో కలిసి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు చట్టానికి లోబడి కోర్టు, లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన అధికారులు తనిఖీలు నిర్వహించడంతో కొన్ని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థి సంఘాల ప్రతిష్టను భంగం కలిగించే విధంగా ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరపాక ప్రభాకర్, పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి పిట్టల శ్రీనివాస్, ముదిరాజ్ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కొంగర ప్రభాకర్, ఎస్సీ సెల్ కార్యదర్శి అరూరి రాజు, నాయకులు కుమారస్వామి, నరేశ్, మధుయాదవ్, దేవా నాయక్, రవీందర్‌గుప్తా, రమేష్, ఆంజనేయులు, శ్రీనివాస్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

మడికొండ: ఆశ కార్యకర్తలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని కోరుతూ ధర్నాకు వెళ్తున్న కడిపికొండ పీహెచ్‌సీ ఆశ కార్యకర్తలను మడికొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీలను, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా వారి మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఆశ వర్కర్లను మడికొండ పోలీసులు హైదరాబాద్ కోఠిలోని వైద్య ఆరోగ్యశాఖ (కమిషనర్)కార్యాలయానికి తరలకుండా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

'ఆశ'ల అరెస్టు అప్రజాస్వామికం

హన్మకొండ: ఆశ వర్కర్లు తమ న్యాయమైన హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలపడానికి సిద్ధమవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అక్రమ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి ఇళ్లలోకి వెళ్లి బలవంతంగా పోలీస్ స్టేషన్‌లకు తీసుకెళ్లడం దుర్మార్గమన్నారు. ప్రజాపాలన అంటూ నిర్బంధపాలన చేస్తుందన్నారు. ఆశ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

ఎమ్మెల్యేకు అభినందనలు

హన్మకొండ చౌరస్తా: గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, బిల్డర్లు ఎదుర్కొంటున్న ఫెనాలిజేషన్ 25 శాతం పన్నుపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలో ప్రస్తావించడంపై క్రెడాయ్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. వరంగల్ నగరంలోని అపార్ట్‌మెంట్ వాసులు, బిల్డర్లు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, గృహ నివాస యజమానులు ఎమ్మెల్యేకు ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

మానవ అక్రమ రవాణా సమాజానికి ముప్పు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు డీసీపీ ఎన్.రవికుమార్

- అదనపు డీసీపీ ఎన్.రవికుమార్

హన్మకొండ: మానవ అక్రమ రవాణా సమాజానికి ముప్పుగా పరిణమించిందని వరంగల్ పోలీసు కమిషనరేట్ అదనపు డీసీపీ ఎన్.రవికుమార్ అన్నారు. వరల్డ్ డే అగేనిస్ట్ ట్రాఫికింగ్ ఇన్‌పర్సన్ పురస్కరించుకుని ఫ్రాన్సిస్కాన్ మిషనరీస్ ఆఫ్ మేరీ సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, నిర్మూలనపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మానవ, పిల్లల అక్రమ రవాణాను అరికట్టడానికి సమష్టి కృషి అవసరమన్నారు. మానవ అక్రమ రవాణా నివారణ కోసం పోలీస్ శాఖ నిబద్ధత, చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జిల్లా సంక్షేమ అధికారి కే.మధురిమ మాట్లాడుతూ నేడు మానవ అక్రమ రవాణాతో పాటు మాదకద్రవ్యాల రవాణా సమస్యగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలల రక్షణ సంరక్షణ కోసం కృషి చేసిన 80 మంది అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను బెకాన్ ఆఫ్ ఎంపవర్మెంట్ 2024 అవార్డుతో సన్మానించారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌లు అన్నమనేని అనిల్ చందర్‌రావు, కే.వసుధ, డాక్టర్ ఎస్.నాగవాణి, ఏసీపీలు డేవిడ్ రాజ్, విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ కె.సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు, డెమో వి.అశోక్ రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎం సాంఘీక సేవా సంస్థ ప్రోగ్రాం అధికారి ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, యూత్ అడ్వకేట్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తాం

- మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి నిర్మల

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో వ్యాపారం చేస్తున్న వ్యాపారులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేస్తామని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల అన్నారు. మంగళవారం మార్కెట్‌లోని సమస్యల పరిష్కారంతో పాటు వసతుల కల్పన కోసం ఆమె మార్కెట్‌లోని వ్యాపారులతో సమావేశం అయ్యారు. సమావేశంలో షట్టర్లు, ప్లాట్లు పొంది అసలు వ్యాపారం చేయని వ్యాపారులను మొదట గుర్తించాలని టమాట వ్యాపారి బాబా సేట్ అన్నారు. మార్కెట్‌లో లైసెన్సులు ఉన్న వారిలో 35 మంది మాత్రమే ప్రత్యక్షంగా వ్యాపారం చేస్తున్నారని అనడంతో మిగిలిన వ్యాపారులు అవాక్కయ్యారు. వ్యాపారం చేయని వారితో తమ లాంటి వారికి చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బినామీలు ఎవరెవరు ఉన్నారన్న విషయం గుర్తించేందుకు అధికారులు విచారణ జరుపుతున్నారని సెక్రటరీ సమాధానం ఇచ్చారు. మార్కెట్‌లో టమాట బండ్లు(డీసీఎం)నిలుపుకునేందుకు స్థలం కేటాయింపులు జరపాలని పలువురు వ్యాపారులు సమావేశంలో కోరారు. మార్కెట్‌లో దుకాణాలు (షెట్టర్లు) కేటాయించేవారికి ముందు ఎన్ని ఫీట్ల స్థలం కేటాయించారని వ్యాపారి బిట్ల కృష్ణ కార్యదర్శిని ప్రశ్నించారు. ఒక్కొక్కరు తమ దుకాణాల ముందు 8–22 ఫీట్ల వరకు స్థలాలు ఆక్రమించుకోవడం వల్ల మార్కెట్‌కు వచ్చే వ్యాపారులకు, వినియోగదారులకు ఇబ్బందిగా మారిందని కేటాయింపులపై స్పష్టత ఇస్తే బాగుంటుందని ఆమెను కోరారు. దీనిపై ఆమె మాట్లాడుతూ బైలాలో చూసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్‌పట్టీలను ప్రతి రోజు అందించాలని మార్కెట్ కార్యదర్శి కోరగా కొంత మంది సరే అన్నారు. మార్కెట్‌లో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో వ్యాపారులకు ఇచ్చిన ప్లాట్లు తొలగించి వాహనాలు నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు అన్నారు. దుకాణదారుడు మృతి చెందితే అట్టి లైసెన్సు, దుకాణం ఎవరికి ఇస్తారని, కొడుకు అయితే పర్వాలేదని మున్నాబాయ్ వ్యాపారి అన్నారు. మార్కెట్‌లో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పారిశుద్ధ్య పనులు నిరంతరం చేయించాలని కోరారు. సమావేశంలో కూరగాయల వ్యాపారులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం : నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని, ఎంతటి వారికైనా శిక్షలు తప్పవని హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం హనుమకొండలోని వాజ్‌పేయి కాలనీలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు ఎవరైనా అమ్మితే అట్టి సమాచారం స్థానిక పోలీసులకు అందించాలన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు గురై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా వాహనాలకు సరైన పత్రాలు లేని 15 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణరెడ్డి, సతీష్, సంజీవ్, 10 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 60 మంది సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్ అంధకారం

హసన్‌పర్తి : డ్రగ్స్ వినియోగిస్తూ పట్టుబడితే భవిష్యత్ అంధకారం అవుతుందని స్థానిక సీఐ జవ్వాజీ సురేశ్ అన్నారు. హసన్‌పర్తిలోని జూనియర్ కళాశాలలో డ్రగ్స్, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగిస్తూ, విక్రయిస్తూ పోలీసులకు చిక్కితే జైలు జీవితం గడపాల్సి వస్తోందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపిందన్నారు. కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోళ్ల పెంపకంపై అవగాహన కల్పించాలి

మామునూరు: నిరుద్యోగ యువతీ, యువకులు, గ్రామీణ ప్రాంత మహిళలకు లాభదాయకమైన కోళ్ల పెంపకంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పౌల్ట్రీ రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు కోరారు. మంగళవారం మామునూరులోని కోళ్ల పరిశోధనా సంస్థ, పశుపరిశోధనా క్షేత్రం, పీవీ నర్సింహారావు తెలంగాణ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రైతుల ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ పౌల్ట్రీ రైతులకు కోళ్లకు వచ్చే వ్యాధులు నిర్ధారించే వరకు అందుబాటులో డయాగ్నస్టిక్ ల్యాబ్ సౌకర్యం కల్పించాలని, చిన్న, మధ్య రకం రైతులు కోళ్ల పరిశ్రమను స్థాపించడానికి కావాల్సిన సహకారం అందించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, రాజు, ప్రకాశ్, ఎస్‌కే బాంజా, విజయ్‌కుమార్, డాక్టర్ హన్మంతరావు, ప్రశాంత్ పాల్గొన్నారు

అంకితభావంతో పనిచేసేవారికే గుర్తింపు



కేయూ క్యాంపస్ : అనుభవజ్ఞులైన ఉద్యోగుల విరమణతో ఇతర ఉద్యోగుల బాధ్యతలు పెరుగుతాయని, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. మంగళవారం యూనివర్సిటీలోని బిల్డింగ్ డివిజన్‌లోని ఇంజనీర్‌గా పనిచేసిన భవాని ప్రసాద్ ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతుండటంతో పదవీ విరమణ సన్మాన సభలో ముఖ్య అతిథిగా మల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం భవాని ప్రసాద్‌కు శాలువా కప్పి పూలబొకేలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో కేయూ అభివృద్ధి అధికారి ఎస్.వాసుదేవరెడ్డి, ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, వి.రాంచంద్రం, యూనివర్సిటీ ఇంజనీర్ రామయ్య పాల్గొన్నారు.

భవాని ప్రసాద్ సేవలు మరువలేనివి

కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ ఉద్యోగిగా పదవీ విరమణ పొందుతున్న జి.భవాని ప్రసాద్ సేవలు మరువలేనివని కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పుల్లా శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదవీ విరమణ కార్యక్రమంలో నాయకులు భవాని ప్రసాద్‌ను శాలువాలతో సన్మానించారు.

గంజాయి విక్రయదారుడి అరెస్టు



రామన్నపేట : సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయి విక్రయానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. నగరంలోని రామన్నపేటకు చెందిన పిట్టల కార్తీక్ వరంగల్‌లోని పండ్ల మార్కెట్‌లో పండ్లు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. సులభంగా ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకొని గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తుండేవాడని తెలిపారు. ఈనెల 29న రామన్నపేటలోని కుంటిభద్రయ్య ఆలయం నుంచి పోతన రోడ్డులోని లేక్ వ్యూ బార్‌వైపు వస్తున్న పిట్టల కార్తీక్ అనుమానంగా కనిపించడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు నేరం అంగీకరించాడు. నిందితుడి నుంచి 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని మట్టెవాడ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

ఖిలా వరంగల్: పోగొట్టుకున్న 17 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు వరంగల్ మిల్స్‌కాలనీ స్టేషన్‌లో బాధితులకు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య మంగళవారం సాయంత్రం అందజేశారు. టెక్ టీం సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

పేదలకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్



హన్మకొండ అర్బన్ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా ఉందని, వ్యవసాయ కార్మికులకు తీరని నిరాశ మిగిల్చిందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు మంగళవారం హనుమకొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి కలెక్టరేట్‌లోని పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అరకొర నిధులు కేటాయించడంతో రెక్కాడితే కానీ డొక్కాడని శ్రమజీవులైన కూలీల బతుకులు దుర్భరమవుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో సంఘం జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మునిగాల భిక్షపతి, రాజమణి, నాయకులు రాజయ్య, శిరీష, పద్మ, లక్ష్మీ, మదనమ్మ, స్వామి, మహేష్, పాల్గొన్నారు.

కేసు నమోదుపై దివ్యాంగుల కృతజ్ఞతలు

నయీంనగర్: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మితా సబర్వాల్ (ఐఏఎస్)పై హ్యూమన్ రైట్స్ కమిషన్ (హెచ్ఆర్‌సీ)లో కేసు నమోదు అయినందుకు తెలంగాణ ప్రభుత్వానికి దివ్యాంగుల సేవా సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రావుల వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగులందరికీ రాష్ట్రంలో ఉచిత బస్సు, ష్యూరిటీ లేకుండా రూ.10 లక్షల రుణం, అంత్యోదయ కార్డులు, ప్రతి జిల్లాకు కమ్యూనిటీ హాల్, మహిళాశక్తి క్యాంటీన్‌లో 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం సలహాదారు వేణుగోపాల్, స్వరూప,రాజయ్య, మహాలక్ష్మీ, సంధ్యారాణి పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

నయీంనగర్: 53వ డివిజన్ శంకర్‌నగర్ కాలనీలో కోతుల బెడదతో కాలనీవాసులు బెంబేలెత్తిపోతున్నారు. కోతులు పెద్దసంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతూ మనుషులపై దాడి చేస్తూ కరుస్తున్నాయి. కోతుల బెడద నుంచి కాపాడాలన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

ఖిలా వరంగల్ : పసుపు కుంకుమ కింద మా చెల్లెకు ఇచ్చిన 140 గజాల ఇంటి స్థలాన్ని ఎస్సైతో బెదిరించి తనతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు బొల్లెపల్లి వీరస్వామి కోరారు. నా కుటుంబ సభ్యులతో నాకు, మా చెల్లెకు ప్రాణభయం ఉందని, మాకు రక్షణ కల్పిస్తూ తనతో చేయించిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దుచేయాలని వీరస్వామి ఈనెల 27న వరంగల్ ఏసీపీతో పాటు మిల్స్‌కాలనీ పీఎస్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రంగశాయిపేటకు చెందిన బొల్లెపల్లి సాయిలుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1997లో మా తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు. అంతకు ముందు మానాన్న మా చెల్లెకు పసుపు కుంకుమ క్రింద 140 గజాల రేకులషెడ్డుతో కూడిన ఇంటిస్థలం ఇచ్చాడు. అట్టి స్థలాన్ని మా వదిన రాణి, నా భార్య సంధ్యారాణి ఇద్దరు కలిసి మా చెల్లె నాగుల రమాదేవితో ఇటీవల గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లగొట్టారు. మీ చెల్లె ఇంటి స్థలాన్ని మాకే రిజిస్ట్రేషన్ చేయాలి లేదా నిన్ను, మీ చెల్లెలను చంపేస్తామని బెదిరించడంతో మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. తనను పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్సై భయాందోళనకు గురిచేసి నా చెల్లి ఇంటి స్థలాన్ని తనతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన సంధ్యారాణి, సాయితేజ్, నితిన్, రాణిలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని నా చెల్లెకి న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



హసన్‌పర్తి : ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హన్మకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని హసన్‌పర్తి సెంటర్‌లో మంగళవారం ప్రధాన రహదారిపై బైఠాయించారు. సుమారు గంటన్నర పాటు రాస్తారోకోతో రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం డీఎస్ఏ జిల్లా కన్వీనర్ శివ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ 8 నెలలు గడిచినా ఆ వైపు దృష్టి సారించలేదన్నారు. విద్యార్థి సంఘం నాయకులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేశారు.